# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 35 సంచిక 11
పేజీలు 40
జులై 2016

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ....................2
శ్రీబాబూజీ ఉవాచ....................3
అమ్మమాట....................6
పంచకోశాలు ....................8
యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ........10
శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ కీర్తనలు..12
కృష్ణాపుష్కర కార్యక్రమములు ....................13
చిదంబర రహస్యం....................16
అహల్య....................18
యోగవాశిష్ఠము ....................20
దైవ పద్ధతి....................22
ఒకే అగ్గిపుల్ల ....................23
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................24
పరిప్రశ్న ....................25
శ్రీమన్నాథమునులు....................27
నువ్వేంటో తెలిసిందా!....................29
శ్రీకృష్ణకర్ణామృతము....................30
గీతాధ్యయనమ్ ....................32
గౌతమమహర్షి ....................34
పావులూరి శాఖ కార్యక్రమాలు....................36
అందరూ శవవాహకులే!.................... 37
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర.....38
విష్ణు కథలు- సూరదాస్ ....................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

వాయు రనిల మమృతమ్ అథేదం భస్మాన్తగ్ం శరీరమ్ ।
ఓమ్ క్రతోస్మర కృతగ్ం స్మర క్రతోస్మర కృతగ్ం స్మర ॥
(ఈశావాస్యోపనిషత్ 17వ శ్లో॥)

ఈశావాస్యమును సర్వత్రా గుర్తించిన సాధకుడు తన మనస్సును మచ్చిక చేసుకోవాలి. మనస్సును హెచ్చరించాలి. దానిని అదుపులో వుంచాలి. జన్మజన్మల నుండి మనస్సు చేసిన గుణకర్మలు, ప్రవృత్తి పరమైన కర్మలు, ఎన్నిపడి వున్నాయో చూసుకోమని మనస్సును హెచ్చరించాలి. అవన్నీ దగ్ధం కావాలి.

జీవిత ధ్యేయాన్ని, సాధన ధ్యేయాన్ని గుర్తు తెచ్చుకోవాలి. దేహము, సంసారము అవాస్తవములని తెలుసుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదు. సంసార బంధము నుండి బయట పడాలంటే తత్త్వ సాధన పటిష్టంగా చేయాలి. ఆచరించే కర్మలలో ఇంద్రియ ప్రవృత్తిని గుర్తించాలి. ఇంద్రియ నిగ్రహాన్ని సాధించాలి. దేహాత్మ భావనని నశింప జేసుకోవాలి. దృష్టిపథంలో సాధన ధ్యేయాన్ని నిలుపుకొని ఓంకార తత్త్వాన్ని స్మరించి, మననం చేయమని మనస్సును హెచ్చరించాలి.

కొంతమంది శ్వాసను చూసుకుని జీవితం గడిచిపోతోందిలే అని తృప్తి చెందుతారు. శ్వాస అంటే చలించేగాలి సుమా. అది దేహంలో శాశ్వతంగా నిలిచేది అంతకన్నా కాదు. మరణం ఆసన్నమైనప్పుడు దేహం దహించబడక తప్పదు కదా! మరణ సమయంలో శ్వాస దేహాన్ని విడిచి లేచిపోతుంది. దేహం దగ్ధమై బూడిద అవుతుంది. శ్వాస దహింపబడక, నిర్దాక్షిణ్యంగా నీ దేహాన్ని విడిచిపెట్టి లేచిపోతుంది.

మనస్సు ద్వారా నీవు చేసిన సాధనలు గుర్తుచేసుకో. అవి నిన్ను దేహాత్మభావన అనే వాసన నుండి విముక్తిని ప్రసాదించ గల్గుతాయా? అందువలన మనస్సుని హెచ్చరిస్తూ, సమాధానపరుస్తూ తన అధీనంలోకి తెచ్చుకోవాలి. దానికి ఏకైక మార్గం ఓంకార స్మరణ. ఓంకార తత్త్వవిచారణ మాత్రమే అని సాధకులను యీ వాక్యం హెచ్చరిస్తోంది!

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ "వామనుడిగా అవతరించి వచ్చిన శ్రీమన్నారాయణుడు బలిచక్రవర్తిని శిక్షించాడా? లేక రక్షించాడా? బలిచక్రవర్తి ప్రహ్లాదుని మనుమడు. కానీ రాక్షస వంశానికి చెందినవాడు. మంచి పరిపాలనాదక్షుడే. సందేహము లేదు. పుణ్యాత్ముడు. సద్గుణసంపన్నుడు. అన్నిటినీ మించి అడిగినవారికి లేదనకుండా దానము చేయడంలో అగ్రగణ్యుడు. కానీ ఆయన అనుచరులంతా అసురులే కదా! అయితే బలి చక్రవర్తి చేసిన పుణ్యము రాశీభూతమై దేవేంద్ర పదవిని కూడా తెచ్చి పెట్టే స్థితిని మించిపోయింది. మరి ఇంద్రాది దేవతలు ఊరుకుంటారా? వారి పదవికి ముప్పు వచ్చినప్పుడు శ్రీ మన్నారాయణుని వేడుకుని తమ పదవులను నిలబెట్టుకోవడానికి ప్రయత్నం చేయడం వారికి అలవాటే.



శ్రీమన్నారాయణుడు మాత్రం బలిచక్రవర్తిని ఉద్ధరించవల్సిన స్థితి ఏర్పడింది కాబట్టి వామనమూర్తిగా అవతరించివచ్చాడు. బలిచక్రవర్తిని పరీక్షించడానికి బాల వటువుగా వేంచేశాడు. వామనమూర్తిని సందర్శించగానే బలిచక్రవర్తి ఆయన దివ్యతేజస్సును దర్శించాడు. మనస్సు నిలిచిపోయింది. బాల వటువు చూడముచ్చటగా ఉన్నాడు. ఆ బాలుని ఎత్తుకుని ముద్దాడాలనిపించింది. అలా కాదు తన మీసం మీద నిలబెట్టితే ఎలా ఉంటుంది? అనుకున్నాడు. సాదరంగా ఆహ్వానించాడు. వచ్చిన పని ఏమిటో తెలుసుకున్నాడు. నీకు కావల్సినదేమిటో నిర్భయంగా "అడుగు". నీకు మణులు మాన్యాలు కావాలా? గోసంపద కావాలా? ధనధాన్యాదులు కావాలా? అడుగు. పోనీ బ్రహ్మచారిగా ఉన్నావు. కన్యలు కావాలా? ఏది కావాలన్నా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాను అడుగు"అన్నాడు.

బలిచక్రవర్తిని గురుదేవుడైన శుక్రాచార్యులు హెచ్చరిస్తూ 'వచ్చిన

వాడెవడో బాలకుడు అనుకుంటున్నావు. కానీ సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. జాగ్రత్త సుమా! నోరు జారి సమస్తము సమర్పిస్తానని అన్నావంటే చిక్కుల్లో పడతావు' అన్నారు. చూశారా సాంగత్య దోషమంటే అదే. నువ్వు ఒక్క అడుగు భగవానుడు వైపు వేస్తే ఆయన ఇరవై అడుగులు నీవైపు వేస్తాడు. ఇది మాత్రం సత్యం. బలిచక్రవర్తి సత్త్వగుణ సంపన్నుడే. అతనిలోని ధార్మికత గొప్పది. కానీ అంతర్గతంగా బహుసూక్ష్మంగా నేను, నాది అనే దురహంకారం దాగి ఉంది. దానిని రహితంచేసి ఆయనను కృతార్థుని చేయడానికే వామనుడు వేంచేశాడు. దానం చేయటంలో నా అంతటివాడు లేడు అన్నది అహంకారమే కదా!

వచ్చిన బాల వటువు సాక్షాత్తూ శ్రీ మన్నారాయణుడే అని తాను నమ్మిన గురుమూర్తి హెచ్చరించినా ఆ వాక్యాన్ని విశ్వసించాడా? అలా విశ్వసించి ఆయనకు తన సర్వస్వాన్నీ సర్వ సమర్పణ చేసుకోవచ్చుకదా! అయినా ఆయనని నీకేమి కావాలో అడుగు అన్నాడు. శ్రీ సమర్థ రామదాసుగారు శివాజీ మహరాజ్ వద్దకు వచ్చినపుడు తన సామ్రాజ్యాన్ని యావత్తూ ఆయన పాదాలచెంత ఉంచలేదా? అలాగే జనక మహారాజు తన గురుదేవుడైన అష్టావక్రునికి తను మనోధనాలను సమర్పించి సర్వసమర్పణ చేసుకున్నాడే! కాని  బలిచక్రవర్తి అలా చేయలేదు. అందువలన నారాయణుడు బలిచక్రవర్తిలో దాగిఉన్న త్రిపుటిని రహితం చేసే నిమిత్తం వామనుడిగా అవతరించాడు.

బలిచక్రవర్తి మూడు పర్యాయములు 'అడుగు' అని అన్నందుకు చాకచక్యంగా వామనుడు మూడు అడుగుల స్థలాన్ని ఇమ్మని కోరాడు. బలిచక్రవర్తిలో దాగిఉన్న త్రిపుటి - స్థూల, సూక్ష్మ, కారణదేహాలు, సత్త్వ, రజో, తమోగుణాలు, జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు, వాసనాత్రయం రహితం కానిదే ఆయన ఎంత పుణ్యం ఆర్జించినా కృతార్థుడు కాలేడు. బలిచక్రవర్తి ఇచ్చేవాడా?  నారాయణుడు పుచ్చుకునేవాడు అయ్యాడా? అదే అవిద్య లేక అజ్ఞానము. ఎంత సుగుణ సంపన్నుడైనా, ఎంత పుణ్యాన్ని ఆర్జించినా, ఎన్ని పుణ్యకార్యలు చేసినా ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించినా

పుణ్యం రాశీభూతమై దేవేంద్రపదవి లభించవచ్చు. కానీ జన్మరాహిత్యం పొందడానికి అవిద్య లేక అజ్ఞానము రహితం కావలసిందే. సత్త్వ గుణం కూడ బంధనేకదా! అందువలననే వామనుడు ఒక మూడు అడుగుల స్థలాన్ని యాచించి ఒక అడుగు పృథ్విపైన ఉంచి స్థూల దేహాన్ని, రెండవ అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించి సూక్ష్మ దేహాన్ని ఛేదించి, మూడవపాదం బలిచక్రవర్తి శిరస్సుపై ఉంచాడు. 'జ్ఞానాంజనశలాకయా' - అన్నట్లుగా కారణదేహము కూడా ఛేదించి బలిచక్రవర్తిలో దాగిఉన్న అవిద్య లేక అజ్ఞానము అనే అహంకారాన్ని రహితం చేసి సమాధిస్థితిని ప్రసాదించాడు. బుద్ధి సమాధి స్థితిని పొందినపుడు ఇంక కావలసినదేమున్నది? ఇప్పుడు చెప్పండి? వామనుడు బలి చక్రవర్తిని శిక్షించాడాలేక సంస్కరించాడా?

బలి తలపై మోపిన పాదస్పర్శ ఎవరికి దొరుకుతుందయ్యా? దానికోసమే ఇంద్రాది దేవతలు ఎదురుచూస్తూ ఉంటారు. అటువంటి సదవకాశము ఒక్క మానవుడికే లభ్యమవుతుంది.

వామనుడు ఆక్రమించిన పృథ్వి, ఆకాశము పంచభూతముల లోనివేగా. మరి వామనుడు బలినుండి ఆశించినది, యాచించినది ఏమిటి? అది కేవలం ఆయన మనస్సును ఆవరించిన అవిద్య.

సగుణ బ్రహ్మాయై అవతరించిన సద్గురుమూర్తి దివ్య చరణారవిందములను సేవించుకునే భాగ్యం ఎవరికి ఉంది చెప్పండి. దేవతలకు సైతం అలభ్యమయ్యే ఆదివ్య నాథుని పాదస్పర్శమీకు సునాయాసంగా అందించి ఏ విధమైన కష్టము లేకుండా అరటిపండు ఒలిచి నోట్లో పెడుతుంటే తినటానికికష్టపడేవారిని రక్షించగలవారెవ్వరు చెప్పండి? ఏ రకమైన కష్టతరమైన సాధన అవసరం లేకుండా శ్రీ కృష్ణ పరమాత్ముడు గోపికలకు అందించిన అతి సులువైన మార్గాన్ని చూపిస్తుంటే అందుకోలేని వారిని ఎవరు ఉద్ధరించగలరు చెప్పండి. కాబట్టి కాలం వృథా చేయకుండా మేల్కొని ఇంతవరకు జరిగినదంతా మరచిపోండి. ఈ క్షణం నుంచైనా మీకు వచ్చిన మానవ జన్మని సార్థకం చేసుకోండి" అని చెప్పారు.

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాల ప్రసాద

# నిర్మల హృదయ విరాజిత చరణం

కొంతమంది తాము కష్టాలలో వున్నామనో, తమకు సంబంధించినవారు బాధలలో వున్నారనో మాకు చెబితే, వారిని దీక్ష చేస్తే బాగుంటుందని సూచిస్తాము. 'దీక్ష మేమే చేయాలా అండీ, లేక ఎవరైనా చేయవచ్చా?' అని అడుగుతారు. మీకు మంచి జరగాలంటే, మీరే దీక్ష చేయాలని అంటామనుకోండి, వెంటనే 'అయ్యో! మాకు తెల్లవారుజామున లేచే అలవాటు లేదండీ, మాకు చన్నీళ్ళ స్నానం చేస్తే జలుబు చేస్తుందండీ, అయినా మీరు సర్వ సమర్థులు కదా, ఆ దీక్ష మీరే చేస్తే బాగుంటుందండీ' అంటారు! ఇలా ఉంటాయి మానవుల మనస్సులు! ఇక వారికి అశాంతి పోవాలంటే ఎలా పోతుంది? ఇంకొకరు అన్నం తింటే మన ఆకలి ఎలా తీరుతుంది? ఎవరి జీవితం కోసం వారే పాటు పడాలి.



నిర్మలమైన హృదయం ఎక్కడి నుంచి రావాలి? దోషం నీ హృదయంలోనే వుంది కాబట్టి దానిని నీవే తుడిచివేసుకోవాలి. లాంతరు చిమ్నికి మసి పడితే బయట తుడిస్తే ఏం లాభం? జ్యోతి దర్శనం అవ్వాలంటే చిమ్ని లోపలవైపు తుడవాలి. ఇవన్నీ మీరందరూ బాగా చెప్పగలరు. కానీ థియరీ పనికిరాదు. ప్రాక్టికల్ కావాలి. పెద్ద పేరంటాలులా వేషం వేసుకుని ఒక పెళ్ళికి వెళ్ళవచ్చు. కాని మనసు లోపల ఈర్ష్యా, అసూయాది గుణాలు కుతకుత లాడుతూ వుంటాయి కొందరికి! బయట వేషం వలన ఉపయోగం ఏమిటి? అందుకే గురుదేవులు ఎప్పుడూ ఈ పాట పాడించుకుంటూ వుండేవారు -

"- వేదశాస్త్రాది విద్యలు నేర్చినా, పెద్ద పేరంది వేషమూ మార్చినా, మెప్పు

వడివేలు లక్షలూ కూర్తినా, లాభమేమున్నదే నీ దయ లేనెడ?
 - కలయ మేనెల్ల భూతి పూసినా, కన్నుమూసి జపమ్ములు చేసినా, పెక్కు గ్రంథాలు తానై వ్రాసినా, నిన్ను సేవింపకే లేదు మోక్షము...... ఎందుకే నరజన్మ విజయకాళీ?..."

ఈ రోజు గురుదశమి. మన దశలు మార్చటానికే యీ తిథిని ఎన్నుకున్నారేమో గురుదేవులు. "అనన్యాశ్చింతయంతో మామ్ యే జనాః పర్యుపాసతే తేషామ్ నిత్యయుక్తానామ్ యోగక్షేమమ్ వహామ్యహమ్" అని గీతాచార్యుడు శెలవిచ్చియున్నారు. ఎక్కడున్నా, ఏమి చేస్తున్నా భగవన్నామం స్మరించాలి. అప్పుడు నీ భారం ఆయనే మోస్తాడు. నిరంతరం భగవన్నామ స్మరణలో, విచారణలో మనస్సునుంచాలి. అప్పుడే అంతఃకరణ పవిత్రత చెందుతుంది.

అలాకాకుండా నిరంతరం ఎంత సంపాదించాలి, ఏం తినాలి అనే ఆలోచనలు చేస్తే, మీ కాలాన్ని వృథా చేసినవారవుతారు. అలాగని అవి చేయవద్దనటం లేదు. మనస్సు భగవంతుని యందు నిలిపి, నామ స్మరణ చేస్తూ మీ మీ పనులు చక్కబెట్టుకోండి. అప్పుడది కర్మలో అకర్మ అవుతుంది. సమయాన్ని ఒబ్బిడి చేసుకోవాలి. నిత్యకాలంలో దానిని జమ చేయండి. సంకల్పించడం మనస్సు యొక్క లక్షణం. దానిని గురించి భయపడకండి, విచారించకండి. నిరంతరం భగవద్విషయం గురించే, సద్విషయం గురించే ఆలోచించండి. ఎల్లవేళలా తత్త్వ విచారణ చేసుకోమని మహాత్ములు శెలవిచ్చారు.

ఒక్క గురువుని ఆశ్రయిస్తే చాలు, మీ గమ్యాన్ని చేరుకోవచ్చు. ఎందరెందరో మహాత్ములుండవచ్చు, మరెందందరో దేవతలుండవచ్చు. కానీ, ఒక్కరిని ఆశ్రయిస్తేనే లక్ష్య శుద్ధి కలుగుతుంది. ఈ ప్రదేశానికి రావడానికి ఎన్నో మార్గాలు వుండవచ్చు, కానీ, ఒక్క త్రోవని ఎన్నుకుంటేనే యిక్కడికి చక్కగా రాగలము. అలాగే ఒక్క గురుపాదాన్ని ఆశ్రయించి, వారి ముఖస్తుగా వచ్చిన పదములను ఆచరిస్తే, మన లక్ష్యార్థాన్ని తప్పకుండా చేరగలుగుతాము.

- సశేషం

# పంచకోశాలు

- పరాశర ప్రసాద్

మలిన మాయ లేక అవిద్యలో ప్రతిబింబించిన చైతన్యం జీవుడిగా వ్యవహరిస్తూ, దేహము, ప్రాణాలు, మనస్సు, బుద్ధి మరియు కారణ దేహం అనే ఆవరణతో వుంటాడు. అటువంటి ఆవరణము - అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ అనే అయిదు కోశములతో కూడి వుంటుంది.

పంచభూతాత్మకమైన స్థూల శరీరమే అన్నమయ కోశము. ఇది ఆహారంపై జీవిస్తుంది. అన్నమయ కోశము ఉనికి, జన్మ, పెరుగుదల, మార్పు, క్షయం, మరణం అనే వికారాలతో కూడి వుంటుంది. అన్నమయ కోశ ప్రధానగుణం తమోగుణం. దీనిలో సూక్ష్మాతి సూక్ష్మంగా వ్యాప్తమై ప్రాణమయకోశం వుంటుంది.

ప్రాణాధార కోశమే ప్రాణమయకోశము - ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన మనే అయిదు ముఖ్యప్రాణాలు మరియు నాగ, కూర్మ, క్రీకర, దేవదత్త, ధనుంజయ అనబడే అయిదు ఉపప్రాణాలతో కూడి వుంటుంది ప్రాణకోశము. ప్రాణం - ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాలను; అపానం - మలమూత్ర విసర్జనను; వ్యానం - రక్త ప్రసారాన్ని; ఉదానం - ఆహారం మ్రింగటానికి; సమానం - ఆహారాన్ని జీర్ణం చేయటానికి తోడ్పడతాయి. అంతేకాకుండా ఉదానం - జీవుని విశ్రమింపజేయటానికి తోడ్పడటం, మరియు మరణ సమయంలో సూక్ష్మ శరీరం స్థూలదేహము నుండి విడిపోవటానికి కూడా తోడ్పడుతుంది.

అలాగే పంచ ఉప ప్రాణాలలో నాగ- ఎక్కిళ్ళు, వాంతులకు; కూర్మ - కనురెప్పల కదలికలకు; క్రీకర - ఆకలి కలుగజేయాటనికి; దేవదత్త - ఆవులింతలకు; ధనుంజయ- శరీర పోషణకు తోడ్పడతాయి. ఇది కర్మేంద్రియాలకు స్థావరం.

మనస్సు యొక్క ఆవరణే మనోమయ కోశం - జ్ఞానేంద్రియాల స్థావరం. మనోమయకోశ వికారాలు - సంకల్ప వికల్పాలు, కామం, క్రోధం,

హర్షం, శోకం, మోహం, మొదలైనవి. మనోమయ కోశంలో మనస్సు, చిత్తం వుంటాయి.

విజ్ఞానమయ కోశం - తెలివికి సంబంధించినది. బుద్ధికి అహంకారానికి స్థావరం. జాగ్రదావస్థ, స్వప్నావస్థలలో యీ కోశం పని చేస్తుంది. జ్ఞాన శక్తి ఈ కోశం యొక్క ధర్మం. వివేకం, నిశ్చయం, కర్తృత్వ, భోక్తృత్వ ధర్మాలు యీ కోశం ముఖ్య లక్షణాలు. సాధనను పెంపొందించు కోవటానికి ఈ కోశం ఉపయోగపడుతుంది.

ఆనందమయ కోశం - ప్రియం, మోదం, ప్రమోదం అనే గుణాలకు నిలయం. నీకు ఇష్టమైన వస్తువు చూసినప్పుడు కలిగేది ఆనందం. అది లభ్యమైనప్పుడు కలిగే గొప్ప ఆనందమే మోదం. అయితే ఆ వస్తువును అనుభవించినప్పుడు కలిగేది అపారమైన ఆనందం అదే ప్రమోదం. సుషుప్తిలోనూ స్వాత్విక కర్మల ఫలితం అనుభవించినప్పుడు పొందే ఆనందం ఈ కోశం ద్వారానే.

ఆనందమయ కోశం అతి సూక్ష్మాతిసూక్ష్మమైనది. ఇది జాగ్రదావస్థ సుషుప్తి అవస్థలోనే కాక, స్వప్నావస్థలో కూడా పనిచేస్తుంది. ఆనందమయ కోశం కారణ శరీరంలో దాగి ఉంటుంది. సూక్ష్మ శరీరంలో ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయకోశాలు వ్యాప్తమై వుంటాయి. అన్నమయ కోశం మాత్రం స్థూల శరీరంలో మాత్రమే వ్యాప్తమై వుంటుంది.

విజ్ఞానమయ కోశం - ఇంద్రియ సంస్కారాలు బాహ్య ప్రపంచం లోనుండి లోపలికి ప్రవేశించకుండా, ఆనందమయ కోశంలో వున్న ఉన్నత సంస్కారాలు బయటకి పోకుండా కాపాడుతుంది. అందువలననే సాధకులకు అత్యంత ఉపయుక్తమైనది విజ్ఞానమయకోశము.

# యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

మాతాజీ : బాగానే అర్థం చేసికొన్నావు. అయితే శ్రవణానికి ఎందుకు ప్రాముఖ్యం ఇవ్వాలి?



రెండవ శిష్యుడు చెప్పలేక పోయాడు. మూడవ శిష్యుడు కలుగజేసుకొని ఇలా అన్నాడు: ఆధ్యాత్మిక ప్రబోధం మనస్సును పవిత్రం చేస్తుంది. అట్టివానిలో సత్సంకల్పాలే వస్తాయి. అతడు మంచినే ఆలోచిస్తాడు; మంచినే కోరతాడు; ఇతరులకు మంచినే చేస్తాడు. కనుక శ్రవణం సాధకులను ఆధ్యాత్మిక సాధనలో పురోగాములుగా చేస్తుంది.

మాతాజీ: మీ ముగ్గురూ బాగానే అర్థం చేసికొన్నారు. ఇంకా చెప్పండి.

నాల్గవ శిష్యుడు : ఇంకేముందమ్మా! కథ కంచికీ....

మాతాజీ : శ్రవణం యొక్క ఆవశ్యకత ఇంకా బాగా వివరించాలి. ఈ కథ ద్వారా మీరు ఏమి చెప్పదల్చుకొన్నారో అది చెప్పాలి. ఆ తరవాత మీ ఉపన్యాసానికి చక్కని ముగింపు ఇవ్వాలి. చివరిగా," నేను చెప్పిన విషయాలు శ్రీగురుదేవులే పలికించుకొన్నారు. ఈ సందర్భంగా ఏవైనా పొరపాట్లు దొర్లితే వాటిని మంచి మనస్సుతో క్షమించండి. నాకు ఈ మహదావకాశం కలిగించించిన శ్రీగురుదేవులకు ప్రణామాలు అర్పిస్తూ. శ్రద్ధగా విన్న మీ అందరికీ నా నమోవాకములు అర్పిస్తూ శలవు తీసుకొంటున్నాను." అని చెప్పాలి.

నలుగురు శిష్యులు: అమ్మా! శ్రవణం యొక్క ఆవశ్యకతను మీరు మాకు తెలియచేయండి.

మాతాజీ : మహాత్ముల బోధలు మానవుడిని మాధవునిగా మారుస్తాయి. అందువలన వారి బోధలను మనం ఎంతో శ్రద్ధగా వినాలి. విన్నదానిని మననం చేసికోవాలి. తరువాత దానిని నిదిధ్యాసలోకి తెచ్చుకోవాలి. శబ్ద, స్పర్శ, రూప, రస, గ్రంథాలనే తన్మాత్రలను మనం వాక్కు, చక్షు, ఘ్రాణ,శ్రవణ, స్పర్శేంద్రియాల ద్వారా గ్రహిస్తాం. అందులో శబ్దానికి ప్రాముఖ్యం ఇచ్చారు. శ్రవణేంద్రియం ద్వారా గ్రహించిన శబ్దం వాక్కును

శుద్ధి చేస్తుంది. బుద్ధి ఆలోచించి దానిని ఆచరణ యోగ్యంచేస్తుంది. శ్రవణం మననానికి దారి తీస్తుంది. అంటే శ్రవణం మనస్సు, వాక్కు, కాయములను శుద్ధి చేస్తుంది. చక్కగా భగవతత్త్వాన్ని శ్రవణం చేసినవాడు ఆత్మ సాక్షాత్కారాన్ని తప్పక పొందుతాడు. నిరంతర శ్రవణం వలన చిత్త ఏకాగ్రత, నిర్మలత్వం లభిస్తాయి.

శ్రవణం యొక్క మహత్తర ప్రభావం శ్రీమద్భాగవతంలోని పరీక్షన్మహారాజు కథ వల్ల తెలుసుకోవచ్చును. పరీక్షన్మహారజు వేటలో అలసి దాహం కోసం శమీక మహర్షి ఆశ్రమానికి చేరి దాహం అడిగితే తపస్సులో ఉన్న శమీకుడు పలుకకపోవటంతో ఆయన మెడలో చచ్చిన పామును వేసి వెళ్ళిపోతాడు. శమీకుని కుమారుడు శృంగి ఏడు రోజులలో పరీక్షిత్తు మరణించు గాక! అని శపిస్తాడు. వ్యాస మహర్షి పుత్రుడైన శుక మహర్షి పరీక్షిత్తుకు శ్రీమహాభాగవత కథను వినిపిస్తాడు. ఆ కథను ఏకాగ్రతతో విన్న పరీక్షన్మహారాజు ఏడు రోజులలో మోక్షాన్ని పొందుతాడు. శ్రవణం వల్ల వచ్చే సత్ఫలితం ఇది.

మొదటి శిష్యుడిని ఉద్దేశించి, మీరు ఇంతకుముందు చెప్పిన కథతో ఇప్పుడు చెప్పిన విషయాలను మేళవించి చక్కగా చెప్పు.

రెండవ శిష్యుడిని నీకు అవకాశం వస్తే ఏ విషయంపైన చెబ్దామను కొంటున్నావు?

రెండవ శిష్యుడు : అమ్మా! బాబూజీ మహరాజ్ వారు చెప్పిన గొల్ల వెంకన్న కథ బాగా తెలుసు. దాని గురించి చెప్పగలను.

మాతాజీ: ఇందాక మనం అనుకొన్నట్లు కథ ఒకటే కాదు. దాని వెనక దాగి ఉన్న ఆధ్యాత్మిక తత్త్వాన్ని వెలికి తీసి చెప్పాలి.

రెండవ శిష్యుడు : తమరు దయతో దానిని వివరిస్తే తప్పకుండా ప్రయత్నిస్తాను.

మాతాజీ : ధ్యానమూలం గురోర్మూర్తిః। పూజామూలం గురోః పదం।
మంత్రమూలం గురోర్వాక్యం। ముక్తి మూలం గురోఃకృపా ॥

"ధ్యానానికి మూలం శ్రీగురుదేవుని మూర్తిని నిలుపుకోవాలి; పూజ శ్రీగురుచరణాలకు చేయాలి; గురుదేవులనుండి వచ్చిన వాక్యమే మంత్రం; శ్రీ గురుదేవుల కృపయే ముక్తిని ప్రసాదిస్తుంది." అని ఈ శ్లోకానికి అర్థం.

-సశేషం



## శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్
## కీర్తనలు

ఓ వినీల కంధరా! నటరాజ సుందరా!
నీవాడ, వీడ, చూడ, వేడు కొందురా!
మనో మందిరా! ........................... ॥ఓ॥

1. భవ భంజన । జన రంజన ।
ఫాల నయన । జిత మదనా ।
ఏలా దయ చూడరావు।
నీలో నను చేర్చుకోవు । ॥ఓ॥

2. వెండి కొండపై దొరా ।
అండనాకు నీవెరా ।
పిన్నవాడ వీడబోకు ।చిన్నచూపు-చూడబోకు ॥ఓ॥

3. కరి, కీటకము, కరకుబోయ ।
మొరలిడ దయ చూడలేద?
దరియగ తడవేల స్వామి?
దయానిధే రావదేమి? ॥ఓ॥

# కృష్ణా పుష్కర కార్యక్రమములు

12-8-2016 శుక్రవారం నుండి 24-8-2016 బుధవారం వరకు
ఓం సమర్థ సద్గురు వాసవి అమరేశ్వర కృష్ణాపుష్కర మహాయాగము

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి దివ్య ఆశీస్సులతో, గుంటూరు జిల్లా, అమరావతిలో, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణములో (శ్రీ అమరలింగేశ్వర స్వామి వారి ఆలయము ఎదుట రథశాల ప్రక్కన) నిర్వహించుటకు నిర్ణయించటమైనది. ఓం సమర్థ సద్గురు వాసవి అమరేశ్వర కృష్ణా పుష్కర మహాయాగము, అన్నదాన సహిత సత్సంగ సమావేశములు, అఖండ హరినామ సంకీర్తన, సాముహిక పూజలు, మరియు ఉచిత వైద్య శిబిరము నిర్వహింప బడును. భక్త మహాశయులందరూ అన్ని కార్యక్రమములలో పాల్గొని యీ సదవకాశమును వినియోగించు కొనగలరని, శ్రీ అమర లింగేశ్వర స్వామి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల దర్శనం చేసుకుని వారి కృపను, శ్రీ సద్గురుదేవుల అనుగ్రహమును పొందగలరని ఆశిస్తున్నాము.

12-8-2016 శుక్రవారం నుండి 24-8-2016 బుధవారం వరకు ఆశ్రమ ప్రధానకేంద్రమునకు (శ్రీకాళీ వన ఆశ్రమము, నంబూరు) విచ్చేయు పుష్కర యాత్రికులకు ఉచిత వసతి, మహాప్రసాదము ఏర్పాటు చేయబడినవి.

కార్యక్రమ వివరములు

నిత్య కార్య క్రమములు -

తెల్లవారుజామున 3గం. నుండి 4గం. వరకు పుష్కర స్నానము.

తె.జా 4గం. నుండి 4-30ని॥ల వరకు మేలుకొలుపు, సుప్రభాతము

తె.జా 4-30ని॥ల నుండి 6గం. ల వరకు ధ్యానము, ప్రార్థన, హారతి.

ఉదయం 6గం. నుండి భోగ ప్రసాద వితరణ.

ఉ. 8గం. నుండి 10గం. వరకు నిత్య పూజలు.

ఉ. 9గం. నుండి మ. 1గం. వరకు; మ. 3గం. నుండి సా. 5గం. వరకు ఉచిత వైద్య శిబిరము.

ఉ. 10గం. నుండి పుష్కర యాత్రికులకు మహా ప్రసాదము.(అన్నదానం)

ఉ. 10గం. నుండి 11-30ని॥ల వరకు శ్రీనివాసరామానుజదాస్‌గారి ప్రవచనము. (భాగవత భక్తుల కథలు)

ఉ. 11-30గం. నుండి 12-30 శ్రీమాతాజీ మరియు మహాత్ముల ప్రవచనములు.

మ.3-30ని॥ల నుండి సా.5గం. వరకు శ్రీసద్గురు మూలమంత్ర హోమం.

సా. 5గం.నుండి 6-30ని॥ల వరకు శ్రీనివాసరామానుజదాస్‌గారి ప్రవచనము. (భాగవత భక్తుల కథలు)

సా. 6-30ని॥ల నుండి 7-30ని॥ల వరకు శ్రీమాతాజీ మరియు మహాత్ముల ప్రవచనములు.

రా. 7-30ని॥ల నుండి 8గం. వరకు మహామంగళహారతి, దర్బారు.

విశేష కార్యక్రమములు -

1. ది. 12-8-2016 నుండి 24-8-2016 వరకు శ్రీ శ్రీరామం (పావులూరు) వారి అధ్యక్షతలో మరియు శ్రీ మేటపల్లి వెంకటేశ్వరరావు గారి ఆధ్వర్యములో శ్రీ అవధూతేంద్ర భక్తమండలి, అడవికొలను మరియు ఏలూరు (ప.గో.జిల్లా) సభ్యులచే అఖండ హరినామ సంకీర్తన.

2. 12-8-2016 శుక్రవారం మ. 12గం.లకు సామూహిక వరలక్ష్మీ పూజలు. మ. 3-30ని॥లకు లక్ష్మీ హోమం

3. 15-8-2016 సోమవారం ఉ.8గం.లకు సామూహిక రుద్రాభిషేకములు, మ. 3-30ని॥లకు రుద్రహోమము.

4. 16-8-2016 మంగళవారం ఉ. 8గం.లకు సామూహిక ఆంజనేయ స్వామి పూజలు, మ. 3-30ని॥లకు మన్యుసూక్త హోమము.

5. 18-8-2016 గురువారం ఉ. 8గం.లకు సామూహిక గురుపూజలు, మ. 3-30ని॥లకు సద్గురు హోమము.

6. 19-8-2016 శుక్రవారం ఉ. 8గం.లకు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి

అమ్మవారి సామూహిక కుంకుమపూజలు, మ. 3-30ని॥లకు లలితా సహస్రనామ హెూమము.

7. 23-8-2016 మంగళవారం ఉ.8గం.లకు సామూహిక హనుమాన్ చాలీసా 108 పారాయణలు, మ. 3-30ని॥లకు ఆంజనేయ మూలమంత్ర హెూమము. సా. 6గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

8. 24-8-2016 బుధవారము ఉ. 9గం.లకు పూర్ణాహుతి, మహా మంగళ హారతి.

గమనిక - కార్యక్రమములలో సమయానుకూలముగా మార్పులు చేర్పులు వుండవచ్చు. దయతో సహకరించవలెను. ఆశ్రమమునకు ఇచ్చు విరాళములకు ఆదాయపు పన్ను చట్టము సె. 80G రాయితి లభించును.

శ్రీకాళీ వన ఆశ్రమము

SRI KALI GARDENS ASHRAMAM

నంబూరు రైల్వేస్టేషన్ ఎదురుగా,

గుంటూరు - విజయవాడ జాతీయ రహదారి,

పోస్టు నంబూరు, పెదకాకాని మండలం,

గుంటూరు జిల్లా - పిన్.కోడ్ 522 508

కార్యక్రమ వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. -
0863-2293564, 2293109 ; సెల్ నెం. - 94404 00100,
90303 81999, 93976 01237, 93465 35357, 83330 67877



# చిదంబర రహస్యం

-సేకరణ కె. మౌనిక; కె. రిషి

మన దేశంలో చిదంబరం, అరుణాచలం, శివకంచి, శ్రీకాళహస్తి, తిరువన్నైకవల్ అనే 5 పుణ్యక్షేత్రాలలో వెలసిన శివలింగాలను 'పంచభూత స్వరూప శివలింగాలు'గా వ్యవహరిస్తారు. చిదంబరంలో ఆకాశలింగం; శివకంచిలో భూస్వరూపలింగం; శ్రీకాళహస్తిలో వాయు లింగం; అరుణాచలంలో అగ్నిలింగం; తిరువన్నైకవల్‌లో జలలింగంగా వెలిసినట్లు తెలుస్తోంది. చిదంబరం $0^{0}$ అక్షాంశంమీద, $79^{0}$ రేఖాంశం మీద వున్నది. చిదంబరం, కాళహస్తి, కంచి, ఏకాంబరేశ్వరం పుణ్యక్షేత్రాలు భూమిపైన  ఒకే వరుసలో వున్నాయి. ఇక్కడ భూమ్యాకర్షణ శక్తి చాలా ఎక్కువగా వుంటుందని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

చిదంబరంలోని ఆలయాన్ని పల్లవులు, చోళులు, చేరరాజులు, విజయనగర రాజులు 12, 13 శతాబ్దాలలో మంచి అభివృద్ధి చేశారు. చిదంబరం గురించి ఒక కథ ప్రాచుర్యంలో వుంది. ఒకప్పుడు ఈ ప్రదేశం అంతా చిట్టడవిలాగా వుండేది. పరమేశ్వరుడు, విష్ణుమూర్తి యిక్కడ సంచరిస్తుంటే, కొందరు దుర్మార్గ సాధువులు వీరి అందచందాలును చూసి వీరిని లోబరచుకోవాలని ప్రయత్నించి ఒక పెద్దపులిని దాడికి పంపారు. పరమేశ్వరుడు ఆ పులిని హతమార్చి దాని చర్మాన్ని తాను ధరించాడు. వాళ్ళు మరల ఒక ఏనుగును పంపితే దాని తలను నరికి విఘ్నేశ్వరునికి తలగా అమర్చాడు. తరువాత ఒక రాక్షసుడిని పంపితే, పరమేశ్వరుడు నటరాజ స్వరూపం ధరించి, తన నాట్యభంగిమలతో వాడిని మైమరపించి మంచి మార్గంలో పెట్టాడు. అంతేకాక ఆ దుర్మార్గపు సాధువులను కూడా మంచి మార్గంలో పెట్టాడు.

చిత్ అంటే 'స్పృహ', అంబరం అంటే 'ఆకాశం' అలాగ చిదంబరం అయింది. చిదంబరం అంటే సదాశివం అనే అర్థం కూడా వుంది. ఇక్కడ శివలింగ రూపంలో దర్శనమిస్తున్న స్వామిని, 'తిరుపాకడల్' అంటారు. అమ్మవారిని 'శివకామి అమ్మాణి' అంటారు. కుమారస్వామిని 'మురుగన్' అని, విష్ణుమూర్తిని 'గోవిందరాజ పెరుమాళ్' అంటారు. గణేశుడు కూడా ఇక్కడ దర్శనమిస్తాడు.

చిదంబరం దేవాలయంలో మొదటగా నటరాజస్వామి దర్శనం

లభిస్తుంది. ఆయనను 'సకల తిరుమమేనీ' అంటారు. తరువాత స్ఫటిక శివలింగ దర్శనమవుతుంది. ఆయనను 'సకల నిష్కళ తిరుమేనీ' అంటారు. చివరగా ఒక తెర వుంటుంది. ఆ తెరను 'నిష్కళ తిరుమేనీ' అంటారు. ఆ తెర వెనుక శివుడు ఆనంద తాండవం చేస్తూ వుంటాడు. జగన్మాత ఆ నాట్యం అందరికీ కనబడకుండా తెరాచాటు చేసి వుంచుతుంది. ఆ తెర అందరికీ కనబడేవైపు నలుపుగానూ, లోపలివైపు ఎరుపుగానూ వుంటుంది.

ఆ తెరను పూజారులు కొద్దిసేపు మాత్రమే తెరచి వుంచుతారు. ఆ తెరను 'మాయ' అని కూడా అంటారు. నలుపు అజ్ఞానానికి సూచిక. ఎరుపు జ్ఞానానికి సూచిక. తెరతీసినప్పుడు శివపార్వతుల దర్శనం అవుతుంది. భగవంతుడు అంతటా అన్నిటిలో వున్నాడనటానికి తెలపటానికి కొందరికి శివపార్వతులగానూ, కొందరికి బంగారపు బిల్వ పత్రాలతో కూడిన బిల్వవృక్షంగానూ ఎవరి భావన ఎలా వుంటే అలా దర్శనం లభిస్తుంది. అజ్ఞానులకు ఏమీ కనబడదు. విశ్వాసం కలిగిన భక్తులకు శివపార్వతుల దర్శనం లభిస్తుందని చెబుతుంటారు.

చిదంబరం దేవాలయ నిర్మాణంలో కొన్ని ప్రత్యేకలున్నట్లు కనుగొన్నారు. మానవుడి దేహంతో పోలుస్తూ నవరంధ్రాలవలె తొమ్మిది మార్గాలున్నాయి. మానవుడికి 21,600 ఉచ్ఛ్వాసనిశ్వాసాలు జరుగుతాయి. ఆ విధంగా 21,600 బంగారు రేకులతో ఆలయం పైకప్పు నిర్మించారట. మనిషి నాడులతో పోలుస్తూ 12వేల మేకులతో వీటిని బిగించారుట. మనిషి గుండె మాదిరిగా ఎడమవైపు 'పొన్నబలం' అనే చిన్న శిల్పం వుంటుంది. శివ పంచాక్షరీ మంత్రం లాగా 5 మెట్లు వుంటాయి.

పరమేశ్వరుణ్ణి పూజించే విధానాలు 28 వున్నాయని సూచిస్తూ 28 స్తంభాలతో ఒక అర్ధ చంద్రాకారపు మండపం నిర్మించబడింది. 64కళలకు 64వాసాలు, అడ్డదూలాలలను మనిషి శరీరంలోని నాడులుగా చెబుతారు. ఈ మండపంలో వుండే 9కలశాలు 9శక్తి రూపాలుగానూ, 18స్తంభాలు అష్టాదశ పురాణాలతోనూ పోలుస్తారు. ఈ అర్ధచంద్రాకారపు మండపం భూమి యొక్క భ్రమణాన్ని సూచిస్తుంది.

'మాయ' అనే తెర వెనుక లభించే దర్శనాలను, అలయ నిర్మాణ రహస్యాలను కలిపి 'చిదంబర రహస్యం' అంటారు.

# అహల్య

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

రామావతారంలో ఎన్నో రాళ్ళు ఆయన పాదాలను తాకి వుంటాయి. అలాగే అప్పటికీ, ఇప్పటికీ ఎందరో జనులు ఆ దేవదేవుని పాదాలను ఆశ్రయించి తమ జీవితాలను గడుపుకుంటున్నారు. కానీ వారందరూ అహల్యలాగ ఎందుకు తరించలేకపోతున్నారు? ఒక్కసారి విశ్లేషించుకుందాం.

మనం మన హృదయ క్షేత్రాలను అహంకార మమకారాలనే జోడెడ్లు కట్టిన మాయయనే నాగలితో దున్నుకొని అందులో కర్మ బీజాలను నాటుకొని మళ్ళీ మళ్ళీ పునర్జన్మలనే పంటలను పండింస్తున్నాం. నాగలిని 'హలం' అంటాం కదా. మరి ఆ మాయ అనే హలం పేరుకైనా తగలని మనో క్షేత్రం కలది కనుకనే ఆ తల్లి అహల్యామాత అయింది. పూర్వ జన్మ సంచిత కర్మ బీజాలు ఏమీ లేకుండా నేరుగా బ్రహ్మలోకంలో ఆ విధాత ద్వారానే సృష్టించబడింది. ఎందరు నవమన్మధులై దేవతలు తనను కోరుకున్నా, పందెంలో గెలిచిన గౌతమ మహర్షినే వివాహ మాడింది.

నాగలి తగలని బంజరు భూములలో వర్షం కురిపించి సేద్యానికి అనుకూలంగా చేయడం ఇంద్రునికి ఇష్టమైన వ్యాపకం. ఆ అలవాటుతోనే తమ మనో క్షేత్రాలలో జన్మపరంపరల సేద్యాన్ని విరమించాలని తపస్సు చేసే వారందరినీ ఎలాగైనా ఆ తపస్సు నుండి విరమింపచేయాలని ప్రయత్నిస్తూ వుంటాడు. ఆ ప్రయత్నాల వర్షాలకి లొంగిపోయిన మనస్సులు మళ్ళీ మళ్ళీ జన్మలకు దారితీస్తూ వుంటాయి. లొంగక దృఢంగా నిలిచినవారు తరిస్తారు.

ఆ మాయను గుర్తించలేని అహల్య తన భర్తే అనుకుని లొంగి పోయింది. మన సనాతన భారతీయ సాంప్రదాయంలో భార్యభర్తల బంధం కేవలం సంసారానికే పరిమితం కాదు. అది ఒక గురు శిష్య సంబంధం. వారిరువురూ కలిసి ధర్మమార్గంలో మోక్షాన్ని పొందేందుకు ఏర్పరచినది. గురువుకి తమ శిష్యుల మీద అవ్యాజ ప్రేమ వుంటుంది. వారు ఎప్పుడు ఏ అంతశ్శత్రువుకు లొంగిపోయి, మాయామోహంలో పడిపోతారో అని నిరంతరం కంటికి రెప్పలా కాచుకుంటూ వుంటారు.

తాబేలు ప్రమాదం ఎదురుకాగానే తన అవయవాలన్నింటిని ఎలాగైతే లోపలకు ముడుచుకొని రాయిలా మారిపోతుందో, సాధకుడు విషయాలు ఎదురుకాగానే అలాగే తన ఇంద్రియాలను లోనికి ముడుచుకుని మనస్సును రాయిలా మార్చివేసుకోవాలి. లేదంటే మాయలో పడి నాశనం అయిపోతాడు. తన శిష్యురాలైన అహల్య అలా ప్రమాదంలో పడిందని గ్రహించగానే గౌతమ మహర్షి పరుగుపరుగున వచ్చి ఆమెను రాయిలా మార్చివేశాడు.

అలా తనను విషయాసక్తి నుండి గురుదేవుని అనుగ్రహం వలన రక్షించుకో గలిగింది కనుకనే ఆ తల్లి పరమాత్ముని పాదం తాకి ముక్తిని పొందగలిగింది.

మరి మనం కూడా మన మనోక్షేత్రాలలోని సంకల్పాలనే మొక్కలన్నింటినీ పీకివేసి గురుదేవుల అనుగ్రహంతో ఇంద్రియాలను నిగ్రహించుకొని మాయా హలం ఛేదించలేనంత గట్టిగా మార్చుకోగలిగితే అహల్యలాగే తలించ గలుగుతాం!!

## వేసవి శిక్షణా తరగతులు

మే 1వ తేదీనుండి మే 29వ తేదీ వరకు శ్రీ కాళీ గార్డెన్స్ ఆశ్రమం, నంబూరులో బాల బాలికలకు వేసవి శిక్షణా తరగతులు డాక్టర్ అరుణ, సుందరి, శైలజ నిర్వహించారు. ఈ తరగతులలో ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలైన అంశాలను బోధించటమే కాక గురుచరిత్ర పఠనము, ధ్యాన ప్రక్రియ, భగవన్నామ జపంలో కూడా బాలబాలికలకు శిక్షణ ఇచ్చార్చు

ఈ అంశాలలో పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి శ్రీ మాతాజీ వారు సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు. ది 27 వ తారీకున ఈ శిక్షణా తరగతులలో పాల్గొన్న వారిని పంచారామాలు, ద్వారకా తిరుమల మొదలైన పుణ్య క్షేత్రాలకు, విహారయాత్రకు తీసుకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో 95 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

(గత సంచిక తరువాయి) # యోగవాశిష్ఠము - సుషుమ్నా ప్రసాద

## భాసుడు, విలాసుల కథ

అప్పడు విలాసుడిలా అన్నాడు, "ఓ భాసా, నా ప్రియసోదరా! నీకు నేను స్వాగతం పలుకుతున్నాను, నా హృదయంలోని అంతరాంతరాల్లో, నీకు ప్రముఖ స్థానమున్నది, నీవే నా జీవానివి. మనమిద్దరము విడిపోయాక, యింత కాలము నీవెలా గడిపావో తెలియజేయి సోదరా" అన్నాడు. నీకు శాంతి, ఆత్మ జ్ఞానము లభించాయా? నీవానందముగా వున్నావా? నీవు మానసిక బాధలు, చింతల నుండి, విముక్తి పొందావా? నీవు నిత్యానంద సుధను గ్రోలావా?" యని ప్రశ్నించాడు.



భాసుడీ విధంగా సమాధానం చెప్పాడు, "నిన్నీ రోజు కలుసుకొన్నందుకు, నేను చాలా అదృష్టశాలిని, వేళ్ళు భూమిలో లోతుగా పాతుకుపోయిన కోరికలనే బీజాలు పూర్తిగా ధ్వంసము కాకుండా, మనసు సంపూర్తిగా నిర్మూలం కాకుండా, మనము శాంతి నెలా ఆశించగలము? ఆత్మ జ్ఞానము లభించనంత వరకు ఆత్మ సాక్షాత్కారము పొందనంత వరకు, సచ్చిదానందము నెలా ఆశించగలము? చూడు, మన జీవితాలెలా నిరర్థకమైన ప్రాపంచిక సుఖాల కోసం, స్వార్థ పూరితమైన చర్యలతో, పనికి మాలిన వ్యర్థ సంభాషణలతో వృథా అయిపోతున్నాయో? ఈ శరీరం యెండిపోయిన చెట్టులా క్షీణిస్తుంది, ముడుతలు పడిన శరీరంతో, నెరిసిన జుట్టుతో వృద్ధాప్యము మనలను కబళించి వేస్తున్నది.

"బలీయమైన కామం, ఆశలు, భయాలు నశించనంత వరకు, దివ్యానుభూతి నెలా పొందగలము? పవిత్రమైన బ్రహ్మానుభూతిని, మనలోని బలీయమైన కోరికలు, ఆరాటమనే కలుపు మొక్కలను, వివేకము వివేచనా శక్తియనే కొడవలితో పెరికి వేసినప్పడే పొందగలము.

మృత్యువనే మూషికము జీవితమనే తాడు యొక్క ముడులను కొరికి వేయటంలో తీరిక లేకుండా వుంటుంది. ప్రాపంచిక జీవితమనే ప్రవాహము కామపూరిత కల్లోలు, బలీయమైన కోరికలనే బురదతో, చింతలు, చికాకులనే బుడగలు, నురగతో, వలసపోవటమనే సుడిగుండాలతో వడిగా ప్రవహిస్తున్నది మనసు విషయేంద్రియ సుఖాలతో క్షణం తీరిక లేకుండా నాట్యము చేస్తుంది."

"అజ్ఞానమనే జాడ్యమును నయముచేయటానికి, బ్రహ్మ జ్ఞానమనే సరియైన ఔషధము, పునర్జన్మయనే భయంకర వ్యాధి నివారణ, బ్రహ్మ జ్ఞానము, అది తిరుగులేని మందు, బ్రహ్మజ్ఞానమును పొందకుండా, భౌతిక సుఖాలలో తమ జీవితాలను వృధా చేసుకొనేవారు, స్వార్థ పూరితమైన చర్యలలో, పనికి మాలిన వ్యర్థ సంభాషణలలో మరల, మరల జనన మరణమనే యిరుసులో బంధింపబడతారు. ఈదురు గాలికి చెట్టు యొక్క యెండిపోయిన ఆకులు ఎగిరిపోయినట్లు, అజ్ఞానులైన మానవులు జీవిత ప్రవాహములో కొట్టుకుపోతున్నారు.

హృదయాన్ని కదిలించే భాసుని ప్రబోధము విని, విలాసుడెంతో సంతోషించాడు, తరువాత యిద్దరు సోదరులెంతో శ్రద్ధగా బ్రహ్మజ్ఞానమును పొందటానికి మనసులు లగ్నము చేసి, ఆత్మ సాక్షాత్కారము పొందటానికి ప్రగాఢమైన, నిర్విరామమైన ధ్యానము చేశారు. అలా ఆత్మ సాక్షాత్కారమును పొంది, జీవన్ముక్తులైనారు.

ఎవరైతే ప్రాపంచిక వ్యవహారములు, అజ్ఞానమనే వూబిలో కూరుకుపోతారో, వారు బాధలు, కష్టాలు, దుఃఖాలు, భ్రాంతులకు లోనౌతారు. ఎవరైతే, ఆత్మ సాక్షాత్కారమును పొందుతారో, వారు నిత్యము లేక అనంతమైన బ్రహ్మానందముననుభవిస్తారు.

- సశేషం

# దైవ పద్ధతి

- రావి శోభ

భర్తృహరి సుభాషితాలలోని, నీతిశతకాన్ని 10 పద్ధతులలో మలచారు. వాటిల్లో 9వ పద్ధతి అయిన 'దైవపద్ధతి' లోనిది ఈ శ్లోకం.

నేతా యస్య బృహస్పతి ప్రహరణం వజ్రం సురాః సైనికాః।
స్వర్గో దుర్గ మనుగ్రహః ఖలు హరే రైరావణో వారణః।
ఇత్యాశ్చర్య బలాన్వితో పి బలభిర్భగ్నః పరైః సఙ్గరే।
తద్వ్యక్తం నను దైవమేవ శరణం ధిగ్వృథా పౌరుషమ్ ॥

తాత్పర్యము - దేవరాజైన ఇంద్రుడే అన్ని సంపదలు ఉండి కూడా శత్రువుల చేతిలో ఓడిపోయాడు. కాబట్టి అన్నిటికీ దైవబలమే ఆధారం కాని పౌరుషం ఎందుకూ పనికిరాదు.

ప్రశాంతమైన ఆశ్రమ వాతావరణంలో సకల విద్యలలోను, వేద శాస్త్రాలలోను నైపుణ్యాన్ని సంపాదించుకున్న శిష్యులను ఉద్దేశించి గురువైన సత్యానందుల వారు మాట్లాడుతూ "అన్ని విద్యలలోనూ నైపుణ్యాన్ని సంపాదించిన మీకు 'దైవబలమే' సర్వవేళలా ప్రధానంగా రక్షిస్తోందని గుర్తించాల"ని హితవు పలుకుతూ .....

"బృహస్పతి గురువై, వజ్రాయుధమే ఆయుధమై, దేవతలు సేనలోని వారై, స్వర్గము కోటయై, విష్ణుమూర్తి అనుగ్రహము కలవారై, ఐరావతమను గజమును కలిగి, ఈ విధముగా ఆశ్చర్యమును కలుగజేయు శక్తిగల అటువంటి స్వర్గాధీశ్వరుడైన ఇంద్రుడినే పరాజితుణ్ణి చేసి, నవగ్రహాలనే తన సింహాసనము క్రింద మెట్లుగా చేసుకుని, త్రిభువనాలను ఏకఛత్రాధిపత్యముగా పరిపాలిస్తూ, అపార పరాక్రమవంతులైన కుంభకర్ణుని, మేఘనాధుణ్ణి తమ్ముడిగా, పుత్రునిగా పొంది, విధాతయైన బ్రహ్మదేవుణ్ణే మెప్పించి, దేవతలతో తనకు ఏ విధంగాను మరణము సంభవించ కూడదని, వరాలు పొంది కూడా, చివరకి నరునిగా అవతరించిన శ్రీమహావిష్ణువు అవతారం అయిన శ్రీరామచంద్రుని చేతిలో యుద్ధ భూమిలో మరణించాడు పరమశివ భక్తుడైన రావణాసురుడు.

కాబట్టి దైవబలమే ప్రధానముకాని, పౌరుషము ఎందుకూ పనికి రాదని గ్రహించి, వివేకజ్ఞానంతో, దైవబలంతో మీ జీవితాలను కూడా ధన్యం చేసుకోవాలి" అని ఆశీర్వదించారు తమ శిష్యులను సత్యానందులవారు.

# ఒకే అగ్గిపుల్ల

(పరమార్థ కథల నుండి)

ఒక ఆసామి చుట్ట కాల్చుకుంటున్నాడు. అతని దగ్గరున్న అగ్గిపెట్టెలో ఒకే ఒక పుల్ల వున్నది. అది పెట్టి చుట్ట వెలిగిస్తున్న సమయంలో ఎవరో స్నేహితుడు వచ్చి, "ఏమండీ! బాగున్నారా?" అని కుశల ప్రశ్న వేశాడు. అతడు దానికి సమాధానం చెప్పకుండా తనపనిలో తాను నిమగ్నమై వున్నాడు. చుట్టవెలిగించటం పూర్తి అయ్యాక ఆ వచ్చినవాడు తిరిగి మాట్లాడుతూ "ఏమిటయ్యా! బాగున్నారా అని అడిగితే సమాధానం చెప్పవు?" అన్నాడు.

దానికి ఆ ఆసామి "అయ్యా! నా దగ్గర ఒకేఒక అగ్గిపుల్ల వుంది. అది వెలిగించాను. మీతో మాటలు పెట్టుకుంటే, ఈలోగా అదికాస్త ఆరిపోతే యిక నాకు చుట్టకాల్చే అవకాశమే పోతుంది. కాబట్టి నేను ఆ సమయంలో మీతో మాట్లాడలేదు" అన్నాడు.

చూశారా! మానవ జీవితం కూడా ఒకే అగ్గిపుల్ల వున్న నిప్పుపెట్టె వంటిది. అది ఆరిపోతే, అంటే జీవితం వ్యర్థంగా గడిపితే, ఆత్మజ్యోతిని అనుభవించటానికి వేరే అవకాశం వుండదు. కాబట్టి ప్రాపంచిక ప్రవృత్తులను కట్టిపెట్టి, లేక తగ్గించుకుని, భగవచ్చింతన, ధ్యానాదుల యందే వున్న సమయాన్ని వినియోగించుకోవటం ఉత్తమం.

మానవ జీవితం మహా దుర్లభమైనది. కాబట్టి జీవితం పరిసమాప్తి కాకమునుపే లక్ష్యమగు ఆత్మసాక్షాత్కారమును పొందాలి.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

జూలై 2016

02 శని : శని త్రయోదశి

03 ఆది : మాస శివరాత్రి , పావులూరు శాఖలో ఏకాహం

04 సోమ : అమావాస్య

15 శుక్ర : తొలి ఏకాదశి, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన

16 శని : దక్షిణాయన ప్రారంభం.

19 మంగ : ఆషాఢ గురు పౌర్ణమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన,చాతుర్మాస్య దీక్షా ప్రారంభం.

29 శుక్ర : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

31 ఆది : గోదావరి అంత్య పుష్కర ప్రారంభం

ఆగస్ట్ 2016

01 సోమ : మాస శివరాత్రి., పావులూరు శాఖలో ఏకాహం

02 మంగ అమావాస్య.

05 శుక్ర : శ్రావణ శుద్ధ తదియ- సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

11 గురు : గోదావరి అంత్య పుష్కర సమాప్తి

12 శుక్ర : కృష్ణా పుష్కర ప్రారంభం; వరలక్ష్మీ వ్రతం.

15 సోమ స్వాతంత్ర దినోత్సవం.

18 గురు : రాఖీ పౌర్ణమి, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

25 గురు : శ్రీ కృష్ణ జన్మాష్ఠమి - ఉదయం కలశ స్థాపన; శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన; భక్త సమారాధన; రాత్రి 7గం।లకు శ్రీ సద్గురు పాద పూజ.

26 శుక్ర : ఉదయం 11గం।లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన.

27 శని : శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన, రాత్రి 7 గం॥లకు ఉట్టి కొట్టుట.

30 మంగ : మాస శివరాత్రి. , పావులూరు శాఖలో ఏకాహం

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'నేను ఎవరు? నా యదార్థ స్థితి ఏమిటి? ఈ లోకంలో వున్న ఏ శాస్త్రమైనా తెలియజేయగలుగుతుందా? నీ ముఖం చూసుకోవాలంటే అద్దం కావాలి కదా!' అన్న విషయాలను ప్రస్తావిస్తూ శ్రీసద్గురుదేవులు "మనస్సు మేలుకొన్నంతవరకే



ఆలోచనలు. మనస్సు పడిపోతే ఏదీ లేదు. నేను వున్నాను కాబట్టి ఆలోచనలు కలుగుతున్నాయి. ఇష్టమైనా, అయిష్టమైనా దానికి ఆధారం ఆలోచనే. మన మనస్సు ఏపని మీద లగ్నమైతే దాని మీదే నిలబడుతుంది.

కాని ధ్యానంలో కళ్ళు మూసినా, తెరచినా నిలబడదు. ధ్యానానికి మనస్సు అవరోధం కాదు. ధ్యానంలో ఎదురైన సమస్యని సరిగా అర్థం చేసుకోక పోవటం, మనస్సుని వినియోగించు కోవటంలో సదవగాహన లేకపోవటమే సమస్య. మనస్సు సహకారం లేకుండా ఏ కార్యమూ నిర్వహించలేవు. కాబట్టి మనస్సే నీకు బంధువు.

సాధకులంతా బహిర్ముఖమైన ఇంద్రియాలు, అంతర్గతంగా వుండే మనస్సుతో పడే ఘర్షణకి గురికాక తప్పదు. పెరుగుకుండలో కవ్వం కదిపితేనే నవనీతం లభించినట్లు మన సాధన, మనస్సు ఆలోచనల మీద ఆధార పడి వుంటుంది. శరీరాన్ని ఒక పరికరంగా వాడుకోవాలి. 'నేను' శరీరానికి విలక్షణం. నీకు శరీరం ఆవాస క్షేత్రంగా వుంది. దానిని ఎలా వినియోగించు కోవాలో, ఎంతవరకు వాడుకోవాలో నీవే నిర్ణయించు కోవాలి. 'ఉద్ధరేదాత్మనాత్మానామ్' అంటే అదే సుమా.

లోకంలో సాధించేది ఏదైనా అశాశ్వతమే, అనిత్యమే. ఏదీ మిగలదు. ఏదీ నీ వెంట రాదు సుమా. 'సంప్రాప్తే సన్నిహితే కాలే నహినహి రక్షతి డుక్కృకరణే' అన్న విలక్షణత్వం అర్థం కావాలి.

అన్నీ సర్దుకుని ప్రయాణం చేసే సమయంలో పరివర్తన వచ్చి ప్రయోజనం లేదు.

నేను ఎవరు? నా యదార్థ స్థితి ఏమిటి? నాకు ఈ దేహాన్ని సమకూర్చినవారు ఎవరు? ఈ జీవిత గమ్యం ఏమిటి? అనే ఆలోచనలతో మనస్సు పరితపించాలి. విచారణ చేయాలి.

ఈ లోకం ఒక ప్రదర్శనశాల. లోకంలో ఉన్న నీ దేహంతో సహా ఏదైనా పరిణామం చెందేదే. దానిని గుర్తించు. ఏదీ నీది కాదు. నీ దేహమే నీది కాదని గ్రహించినప్పుడు ఇంక నీ బంధుమిత్రుల గురించి ఆందోళన చెందవలసిన అవసరం ఏమున్నది?

నీ దేహంలో జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు సక్రమంగా కార్య కలాపాలు నిర్వహించటానికి తోడ్పడేది ఎవరు? అనే విచారణ చేయి. దానికి సమాధానమే 'నేను ఎవరు?' అనే ప్రశ్నకు సమాధానంగా గుర్తిస్తావు. అదే ఆత్మసాక్షాత్కారము. అదే మోక్షస్థితి. దానిని సాధించిన వారికి పునరావృత్తి లేదు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

జూలై 2016

15 శుక్ర : తొలి ఏకాదశి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

19 మంగ : ఆషాఢ గురు పౌర్ణమి, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

29 శుక్ర : శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

ఆగస్ట్ 2016

18 గురు : రాఖీ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

25 గురు : శ్రీ కృష్ణ జన్మాష్టమి - రాత్రి 7గం।లకు శ్రీ సద్గురు పాద పూజ; ఉట్టి కొట్టుట.

27 శని : శ్రీ గురు దశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

# శ్రీమన్నాథమునులు -సేకరణ మురళీ

శ్రీమన్నాథమునులు పరమ భక్తి జ్ఞాన వైరాగ్య సంపన్నులు. వారు రాజమన్నారు కోవెలలో కూర్చుని తపస్సు చేసుకుంటుండగా, అక్కడ స్వామిని సేవించటానికి వచ్చిన ఇద్దరు శ్రీవైష్ణవులు, శ్రీ నమ్మాళ్వార్లు పాడిన 'తిరువాయి మొళి'లోని పది పాశురములను అర్థవంతంగా, రాగయుక్తంగా పాడితే, ఆ పాశురములు విని శ్రీమన్నాథమునులు బ్రహ్మానందపడిపోయి, ఈ పదిపాశురములు ఇంత బాగున్నాయి కదా! ఇక తిరువాయ్ మొళిలోని వేయి పాశురములు ఇంకా ఎంత బాగుంటాయో అని వారిని ఆ వేయి పాశురములను కూడా పాడమని కోరగా, ఆ వైష్ణవులు సమాధానం చెబుతూ 'అవి మాకు రావు. ఈ పది మాత్రమే మాకు వచ్చు. మీకు ఆ పాశురములు కావాలంటే నమ్మాళ్వార్లు అవతరించిన తిరునగరి వెడితే అక్కడ లభించవచ్చు' అని చెప్పారు.

అది విని వెంటనే శ్రీమన్నాథమునులు తిరునగరి వెళ్ళి అక్కడున్న వారిని అడుగగా వారు 'ఈ దివ్య ప్రబంధమునకు ప్రతి పదిపాశురముల చివర ఈ పదిపాటలు పాడిన వారికి తప్పక వైకుంఠము కలుగునని పాడారు కదా. అందుకే ఈ దివ్య ప్రబంధము అనుసంధానము చేసిన ప్రతివారు వెంటనే పరమపదించేవారు. అందుచేత పదిమంది ఆళ్వార్లు పాడిన యీ నాలాయిర దివ్య ప్రబంధమునకు 'చావుపాటలు' అని పేరు పెట్టి భూమిలో పాతిపెట్టారు. ఆ కారణంగా యిప్పుడు ప్రవచనములోనికి ఆ చావుప్రబంధములు లేవు' అని చెప్పారు.

అది విని శ్రీమన్నాథమునులు ఎంతో చింతించి, ఎలాగైనా ఆ దివ్యప్రబంధాన్ని సాధించాలని, పట్టుదలతో ఆళ్వారు వేంచేసివున్న చింతచెట్టు తొఱ్ఱకు ఎదురుగా యోగారూఢుడై లక్ష సార్లు శ్రీ నమ్మాళ్వారుల నామము జపించి, సిద్ధి పొందే సమయానికి శ్రీ నమ్మాళ్వారులు ప్రత్యక్షమై, 'మీ కేమి కావాలి?' అని అడిగితే, పెరియాళ్వారు మొదలుకొని ఆళ్వారులంతా పాడిన దివ్య ప్రబంధములన్నీ కావాలి' అని ప్రార్థించగా, 'సరే. అటులనే' అని, తమ అర్చావతారమునకు

వీరికి మధ్య ఒక తెర కట్టించి, వారు ఆ తెరలో నుండి నాలాయిరము అనగా అందరాళ్వారులు పాడిన నాలుగువేల పాశురములను పాడుతూ వుండగా వీరు ఆ నాలాయిర ప్రబంధములన్నీ తాటాకుల గ్రంథములో వ్రాసుకొని కృతార్థులై, తిరిగి తమ ఊరికి వచ్చి, వేదమునకు మంగళార్థము 'ఓం' అనే ప్రణవమును మొదట ఉన్నట్లు ఈ దివ్య ప్రబంధమునకు 'పల్లాండు' అనే మంగళార్థము మొదట వుంచి, రాగము, తాళము, అర్థ విభాగములన్నీ ఏర్పరచి శ్రీరామమిశ్రులు, శ్రీపుండరీకాక్షులు అనే తమ ప్రియ శిష్యుల ద్వారా ప్రపంచమునకంతా వ్యాప్తి చేసిన వాగ్వైభవము కలవారు శ్రీమన్నాథమునులు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

జూలై 2016

15 శుక్ర : తొలి ఏకాదశి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన

19 మంగ : ఆషాఢ గురు పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥సత్సంగం, శ్రీ సద్గురుపాద పూజ, భక్త సమారాధన.

29 శుక్ర : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

ఆగస్ట్ 2016

18 గురు : రాఖీ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

25 గురు : శ్రీ కృష్ణ జన్మాష్టమి - సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

27 శని : శ్రీ గురు దశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

# నువ్వేంటో తెలిసింది!

- పెనుమాక నాగేశ్వరరావు

నువ్వేంటో తెలిసిందీ, నేనే నువ్వని తెలిసిందీ
అనుమానం వెలిసింది, ఆనందం విరిసింది
మనసంతా మురిసిందీ, తనువంతా మెరిసిందీ
సందర్భం కుదిరింది, సంతోషం మిగిలిందీ ॥నువ్వేంటో॥

ఏకాంతం దొరికింది, ఏకాగ్రత కుదిరిందీ
సంకల్పం కలిగిందీ, సద్భావం మెదిలింది
సందేహం తొలిగింది, సాంగత్యం నిలిచింది
సందర్భం కుదిరింది, సంతోషం మిగిలింది ॥నువ్వేంటో॥

హృదయం పలికింది, మనసేమో కులికింది
ఆత్మీయత పిలిచింది, అనురాగం కురిసింది
విశ్వాసం పెరిగిందీ, అభ్యాసం నేర్పింది
సందర్భం కుదిరింది, సంతోషం మిగిలింది ॥నువ్వేంటో॥

---

## <u>అమెరికా,సెయింట్ లూయిస్‌లో త్రయాహ్నిక దీక్ష, సత్సంగ కార్యక్రమాలు</u>

ది. 22-7-2016 (శుక్రవారం) నుండి ది. 24-7-2016 (ఆదివారం) వరకు శ్రీ మాతాజీ వారు త్రయాహ్నిక దీక్షతో,ప్రార్థన, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగము మొదలైన కార్యక్రమాలు సెయింట్ లూయిస్‌లో నిర్వహిస్తారు.

ఎడ్రస్ : House of Prasad & Sunanda Kuruchety,
12616 Town & Country EstatesIn
St.Louis, Mo - 63141 (Phone :314 993 - 6212)

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

(గత సంచిక తరువాయి)

29 వ, శ్లోకం, ద్వితీయాశ్వసము

దేవకీ తనయ పూజన పూతః
పూతనారి చరణోదక ధౌతః
య హృదయం స్మృత ధనంజయ సూతః
కిం కరిష్యతి స మే యమదూతః ?



తాత్పర్యం - నేను దేవకి కొడుకు సేవ చేయుచు, నా దేవుని పాదతీర్థంచే పవిత్రుడనయి, ఎల్లవేళల యందు నా స్వామినే తలచుచుండనేని యమ దూతలు నన్నేమి చేయగలరు?

"శ్రీపతీ! నువ్వే ఎన్నో ఇబ్బందులు పడుతుంటే చూస్తుంటే నాకు జాలి కలుగుతోందిరా! నిన్ను కష్టాల నుండి గట్టెక్కించే ఘనుడి దగ్గరకు తీసుకువెళ్ళటవే ఆప్తమిత్రుడిగా నీకు నేను చేయగలిగిన సహాయం" అంటూ నరహరి, శ్రీపతితోపాటుగా యమునా నది తీరాన నడుస్తున్నాడు.

గోవుల మందలు మేత మేస్తూ అక్కడక్కడ కనిపించాయి. వాటి మధ్యన ఉన్న గోపబాలుర దగ్గరకి ఇద్దరూ వెళ్ళారు. నరహరి చుట్టూ కలయ చూస్తూ "కన్నయ్య ఏడి రా?" అని ఆ పిల్లలను అడిగాడు. "అదిగో! తూర్పు తీరాన పచ్చిక బాగుందని కన్నయ్య గోవులను అటువైపుగా తోలుకు వెళ్ళాడు. ఇప్పుడప్పుడే రాడు" అని చెప్పారు. నరహరి "అయితే రేపు ఇక్కడే వుంటాడు కదా!"అని అడిగాడు. వాళ్ళు అవునని చెప్పారు. రెండోరోజు వచ్చి అడిగితే, వాళ్ళమ్మ పిలిస్తే కన్నయ్య ఇంటికి వెళ్ళిపోయాడు అని చెప్పారు. మూడోనాడు వచ్చి చూస్తే కన్నయ్య గుంపుగా ఉన్న చెట్ల నీడలో నిదుర పోతున్నాడు. లేపుదామా? అని నరహరి అడిగితే ఆ పిల్లలు 'అమ్మో! ఇంకేమైనా ఉందా? యశోదమ్మకి తెలిస్తే మమ్మల్ని దండిస్తుంది' అన్నారు. కన్నయ్య నిద్రాముఖం చూసి ముగ్ధుడైన శ్రీపతి అయితే రేపు వస్తాము అని చెప్పి వెనక్కి తిరిగారు.

దారిలో శ్రీపతి నరహరితో "ఇంత చిన్నపిల్లవాడా! నాకు సహాయం చేయగలిగిన ఘనుడు" అని నరహరితో అన్నాడు. అప్పటికే శ్రీపతి మనస్సులో ఆవేదన మొదలైంది. నాలుగోరోజు ఇద్దరూ వచ్చేసరికి ఎదురుగా కనిపించాడు కన్నయ్య.

"కన్నయ్యా! ఇతడే నేను చెప్పిన నా స్నేహితుడు. నీ సహాయం కోరి వచ్చాడు" అన్నాడు నరహరి కన్నయ్యతో. కన్నయ్య శ్రీపతి వంక తిరిగి, "ఏమిటి ఇంత చిన్నపిల్లవాడు కదా! నాకు సహాయం చేయగలడా?' అని మనస్సులో అనుకున్నావు కదా" అన్నాడు కన్నయ్య. నరహరితోటి "నా వివరాలన్నీ నీ మిత్రుడికి చెప్పు. నా మీద నమ్మకం కుదిరితే తప్పక సహాయం చేస్తాను" అన్నాడు కన్నయ్య.

ఇంటికి చేరగానే శ్రీపతికి ఒక శుభవార్త అందినది. దూరపు బంధువు ఒక వృద్ధుడు మరణిస్తూ తన లంకంత ఇంటినీ, యావదాస్తిని శ్రీపతికే చెందేట్లుగా ఒక విల్లు రాసి పోయాడు. మరునాడు వాళ్ళు మళ్ళీ కన్నయ్య దగ్గరకు వెళ్ళి శుభవార్త చెప్పగానే, కన్నయ్య "ఆ వృద్ధుడు మంచి భక్తుడు. నేనే అతని మనస్సులో ప్రవేశించి ఈ ఆలోచన కలిగించాను. రేపే ఆ క్రొత్త ఇంటిలోకి వెళ్ళండి" అని చెప్పాడు.

క్రొత్త ఇంటిలోకి వెళ్ళిన మొదటి రోజునే శ్రీపతి పెరట్లో పూలు కోస్తుంటే అడుగుల చప్పుడు అయింది. ఎవరా? అని చూస్తే కన్నయ్యే! ఆనందంలో మునిగిపోతూ శ్రీపతి పూలన్నీ కన్నయ్య పాదాలపైనే పోసేశాడు. "ఈ ఇంట్లో దేవతార్చన ఉంది. రోజూ నువ్వు పూజచేసుకో" అన్నాడు కన్నయ్య. "మరి నాకు ఏ మంత్రాలు రావు" అని చెబుతున్న శ్రీపతితో "అయితే నరహరిని అడిగి తెలుసుకో" అన్నాడు కన్నయ్య.

"నీ పేరు కృష్ణయ్య కదా! అదే నాకు మంత్రం" అంటున్న శ్రీపతితో "అది చాలులే. ఈ దేవతార్చనలో రోజూ నీకు కనిపిస్తాను" అని అభయమిచ్చి కదిలాడు కన్నయ్య.

శ్రీపతి జరిగినదంతా నరహరితో చెబితే విని, "ఏకాలంలోనూ కృష్ణ నామ స్మరణ మరువకు. ఆయన దయ నీకు సంపూర్ణంగా లభించింది. ఇక నీకు యమదూతల భయం కూడా ఉండదు" అన్నాడు నరహరి.

(గత సంచిక తరువాయి) **గీతాధ్యయనమ్** - రమణ ప్రసాద్

## 16. దైవాసుర సంపద్విభాగయోగము



సద్గుణములు జీవుడిని భగవంతుని సమీపానికి చేరుస్తాయి. వాటిని 'దైవ సంపద' అంటారు. దుర్గుణములు (అసురగుణములు) భగవంతుడినుంచి దూరంగా తీసుకుపోతాయి. ఈ రెండిటిని భగవానుడు చెబుతున్నాడు:

" అర్జునా! అభయం, చిత్త శుద్ధి, జ్ఞానయోగ నిష్ఠ, దానము,ఇంద్రియ నిగ్రహము, వేద పఠనము, తపస్సు, సరళ స్వభావము, అహింస, సత్యము, కోపము లేకపోవటము, త్యాగ బుద్ధి, శాంతి, చాడీలు చెప్పక పోవటము, భూత దయ, విషయ వాంఛ లేక పోవటము, మృదుత్వము, సిగ్గు, చపలత్వం లేకపోవటము, తేజస్సు, ఓర్పు, ధైర్యము, శుచిత్వము, ద్రోహం చేయకపోవటము, దురభిమానం లేక పోవటము - ఈ 25 సుగుణాలు దేవతల సంపద వల్ల పుట్టిన వాడికి కలుగుతాయి.

రాక్షస సంపద ద్వారా పుట్టినవాడి లక్షణాలు - కపటము, గర్వము, దురంహంకారము, కోపము, కఠినత్వము, అవివేకము.

దైవ సంపద ద్వారా మోక్షము, అసుర సంపద ద్వారా సంసార బంధం కలుగుతాయి.

అసుర స్వభావం కలిగిన వాడికి చేయ తగ్గదేదో, చేయకూడ నిది ఏదో తెలియదు. వారిలో శుచిత్వం, సదాచారం, సత్యం కనిపించవు. జగత్తు సత్యం అని, కామవశంతో స్త్రీ పురుషుల కలయక తప్ప సృష్టికి మరో కారణం లేదని వాదిస్తారు. వారు లోక కంటకులు. అంతూ దరీ లేని కోరికలతో, దుర్గుణాలతో దురాచారులై తిరుగుతారు.

వారు మృతి చెందే వరకు మితి లేని చింతలతో కామభోగాలను అనుభవించటమే పరమావధిగాబావించి, ఆశాపాశాలలో చిక్కుకొని, కామ క్రోధాలకు పశువులై విషయ సుఖాల కోసం అక్రమ ధనార్జనకు పూనుకుంటారు.

నేను డబ్బున్నవాడిని; ఉన్నత వంశంలో ఉద్భవించిన వాడిని; నాకు ఎవరూ సాటి రారు; నేను యజ్ఞ దానాలు చేస్తాను; - అనే అజ్ఞానులు, మోహ పరవశులు అయిన ఆ అసుర స్వభావులు కామ భోగాలలో చిక్కుకొని చివరకు ఘోర నరకం పాలౌతారు.

అహంకారం, బలం, గర్వం,కామం, క్రోధం - వీటిని ఆశ్రయించి, అసూయ పరులై అందరి శరీరాలలో ఉన్న నన్ను ద్వేషిస్తారు. అటువంటి ద్వేష పూరితులను నేను మళ్ళీ సంసారంలో పడవేస్తుంటాను.

త్రివిధం నరకస్యేదం, ద్వారం నాశన మాత్మనః।
కామః క్రోధస్తథా లోభః తస్మాదేతి త్రయం త్యజేత్ ॥ 21

కామం, క్రోధం, లోభం - ఈ మూడూ నరక ద్వారాలు. ఇవి ఆత్మనాశనానికి కారణాలు. అందువలన ఈ మూటిని విడిచిపెట్టాలి. ఈ మూడు దుర్గుణాలను విడిచినవాడు తనకు తాను మేలు చేసుకొన్న వాడై పరమ పదాన్ని పొందుతాడు.

శాస్త్రాలను విడిచిపెట్టి ఇష్టానుసారంగా ప్రవర్తించేవాడు తత్త్వ జ్ఞానం గాని, సుఖం గాని, మోక్షం గాని పొందడు.

అందువలన చేయదగ్గది ఏదో, చేయకూడనిది ఏదో నిర్ణయించుకోవటానికి శాస్త్రమే ప్రమాణం. కాబట్టి శాస్త్రానుసారంగా నీవు కర్మలు చేయాలి.

- సశేషం

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జులై 2016, ఆగస్ట్ 2016 మాసాల లో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

జులై 2016 : AS 011G, 012G, 013G, 3728, 4767, 4769, 5195, 5916,
AS 5930, 6154, 6405, 6413, 6670.

ఆగస్ట్ 2016 : AS 6415, .6418, 6420, 6531, 6898, 6905, 7137, 7138
AS 7145, 7147, 7148, 7149, 7150

– మేనేజర్

# గౌతమ మహర్షి - రమణ ప్రసాద్

గౌతమ మహర్షి బ్రహ్మ మానస పుత్రులలో ఒకడు. గౌతమ ధర్మసూత్ర కర్త. విష్ణుమూర్తి మోహినీరూపం ధరించి త్రినేత్రుడిని సురాసురలను మోహింప చేయగా బ్రహ్మ సృష్టి దీనికి ఏ పాటి సాటి? అని తలపోశారు. ఆ కారణంగా బ్రహ్మ అహల్య అనే మోహనాంగిని సృష్టించి తపస్సు చేస్తున్న గౌతమునికి పరిచర్య చేయమని ఆదేశించాడు.



అహల్య గౌతమునికి హెూమాదికృత్యాలలో సహాయం పడుతోంది. కొంతకలానికి అహల్యకు యుక్త వయస్సు వచ్చింది. గౌతముడు ఆమెను తీసుకొనివెళ్ళి బ్రహ్మకి ఇచ్చాడు. బ్రహ్మ ఆమెను గౌతమునికి ఇచ్చి వివాహం చేయాలని ఉన్నా ఆమె త్రిలోకసుందరి అవటం చేత ఇంద్రాది దేవతలు'మాకిమ్ము, మాకిమ్మ'ని బ్రహ్మను అడగటంతో 'ఎవరు భూప్రదక్షిణం చేసి ముందు వస్తారో అహల్యను వారికిచ్చి చేస్తాను'అని చెప్పాడు. దేవతలు,ఋషులు భూప్రదక్షిణానికి బయల్దేరారు. గౌతముడు దగ్గరలోఉన్న గోమాతకు ప్రదక్షణ చేశాడు. శృతివాక్యం ప్రకారం అది భూప్రదక్షిణానికి సమానమవటం చేత మిగిలినవారు తిరిగి వచ్చేసరికి బ్రహ్మ అహల్యాగౌతములకు వైభవంగా వివాహం చేశాడు. ఇంద్రాది దేవతలు గౌతముని మాహాత్మ్యానికి మెచ్చి అహల్యా గౌతములను అభినందించి వెళ్ళిపోయారు.

అహల్యా సహితుడై దండక వనంలో బ్రహ్మదేవుని గురించి తపస్సు చేయగా, బ్రహ్మ వరం కోరుకోమనగా, గౌతముడు,"బ్రహ్మదేవా! నేను వేసిన విత్తనం జాములో పంటకు వచ్చునట్లు చేయమ'ని కోరగా, బ్రహ్మ ఆ వరాన్ని ప్రసాదించాడు. ఇలా ఉండగా అక్కడ క్షామం సంభవించి, పంటలు నశించి ప్రజలు ఆకలి బాధతో ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరు

శవాలనే తినటం మొదలు పెట్టారు. వారందరు గౌతముని అశ్రయించారు. గౌతముడు అహల్యతో కలిసి తన తపశ్శక్తి చేత అందరికి అన్న వస్త్రములనిచ్చి ఆదరించాడు. తండోపతండాలుగా జనులు భార్యాపుత్రులతో వచ్చి నివసించటం మొదలు పెట్టడంతో గౌతముని ఆశ్రమం దినదినాభివృద్ధి పొంది గౌతముని కీర్తి ఇంద్రలోకానికి వ్యాపించింది. క్షణమైనా ఏమరకుండా అహల్యా గౌతములు అతిథి సేవలో ఉన్నారు.

ఇలా ఉండగా విఘ్నేశ్వరుడు తల్లికి సవతి బాధ తొలగించటానికి గంగను భూమికి తేవాలని నిశ్చయించి, అది గౌతమ మహర్షికే సాధ్యమని బ్రాహ్మణ వేషంలో గౌతముని ఆశ్రమానికి వచ్చాడు. పార్వతి యొక్క చెలికత్తెను గోవురూపం ధరించమని చెప్పి,"గౌతముడు ఏది చేసినా వెంటనే చనిపొమ్మ"ని చెప్పాడు. గౌతముడు దానిమీద గరిక వేయగానే అది మరణించింది. అక్కడ బ్రాహ్మణులందరూ గోహత్యా పాతకుడని గౌతముని నిందించారు. గౌతముడు పాప విముక్తిని కోరగా బ్రాహ్మణవేషంలో ఉన్న విఘ్నేశ్వరుడు,"మీరు తపస్సు చేసి శివుని మెప్పించి, గంగా భవానిని ఇచ్చట ప్రవహింప చేస్తే నువ్వు త్రిలోకములలోపూజింపబడతావు" అని చెప్పాడు. గౌతముడు తపస్సు చేసి చేసిశివునిమెప్పించగా"శివుడు, గంగాదేవిని మాయాగోవు చనిపోయినచోటప్రవహించేటట్ల చేయమని ఆదేశించగా, గంగ అనుగ్రహించి భూమిపై అవతరించింది. గౌతముని మూలమున అవతరించుట చేత 'గౌతమి' అని 'గోదావరి' అని పేరు వచ్చింది.

అహల్య పతిసేవే మహాభాగ్యంగా భావించి గౌతముని సేవ చేస్తోంది. వారికి శతానందుడను కుమారుడు, అంజన అను కుమార్తె కలిగారు. శతానందుడు వెంటనే తపస్సు చేయటానికి తలి దండ్రుల ఆజ్ఞ తీసుకొని అడవికి వెళ్ళిపోయాడు. కాలాంతరాన అతడు శరద్వంతుడు అని పిలువబడుచు మహా తపస్సంపన్నుడయ్యాడు. అతనికి కృపి, కృపాచార్యుడు పుట్టారు. అంజని పుత్రుడే ఆంజనేయుడు.

- సశేషం

# పావులూరి శాఖలో కార్యక్రమాలు

## శ్రీఅవధూతేంద్ర సరస్వతీ స్వామివారి 41వ పుణ్యారాధన మహోత్సవములు

శ్రీఅభయాంజనేయ స్వామి, శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి దివ్యాశీస్సులతో, శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వాములవారి 41 వ పుణ్యారాధన మహోత్సవాలు శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాద మాతాజీ వారి అధ్యక్షతతో మరియు శ్రీ అవధూతేంద్ర నిలయం (పావులూరు) వ్యవస్థాపకులు శ్రీ రామంగారి అధ్వర్యంలో పంచాహ్నిక శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి పుణ్యారాధన, అఖండ హరినామ సంకీర్తన, సత్సంగ సమావేశములు 2-6-2016 గురువారం నుండి 7-6-2016 మంగళవారం వరకు ఎంతో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సామూహిక అమ్మవారి కుంకుమ పూజలు, నిత్యాన్న దానము జరిగాయి. ప్రతి రోజు శ్రీ మాతాజీ వారి దివ్య ప్రవచనము,శ్రీ రామానుజదాస్ గారిచే పురాణ ప్రవచనము జరిగాయి. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీకాళీప్రసాద స్వచ్ఛంద సేవ సంస్థ - కర్నూలు

### ఉచిత వైద్యశిబిరము

*ది.19-6-2016 ఆదివారం నాడు కర్నూలుజిల్లా, పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో శ్రీ P.CH. ధర్మారెడ్డిగారి ఆధ్వర్యంలో శ్రీ కాళీప్రసాద స్వచ్ఛంద సేవాసంస్థ వారిచే ఉచిత వైద్యశిబిరము నిర్వహించ బడినది. ఈ శిబిరంలో 60మందికి 62 రకాల వైద్య పరీక్షలు కేవలం 399 రూ॥లకే నిర్వహించి, వైద్య సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ సంస్థవారు అల్పాహారం అందించారు.*

# అందరూ శవవాహకులే!



భగవాన్ శ్రీ రమణమహర్షులవారు విరూపాక్ష గుహలో వుండగా, అప్పుడే శవాన్ని మోసుకువచ్చిన ఇద్దరు శవవాహకులు వివాదపడుతూ వచ్చి భగవాన్‌ని తీర్పుకోరారు.

ఒకరు "స్వామీ! ముందు స్నానం చేసి భోజనం చేద్దామంటే వీడు వినటం లేదు. నాది న్యాయం కాదా?" అన్నాడు.

"న్యాయమే!" అన్నారు మెల్లగా భగవాన్.

రెండోవాడు ఉగ్రుడై "స్వామీ! ఆకలవుతుంటే భోజనం చేయటం తప్పా?" అన్నాడు.

"తప్పు అనలేదే! ఆకలవుతుంటే భోజనం చేయవచ్చునే" అన్నారు భగవాన్.

ఇద్దరూ ఒక్కటై "అయితే మాలో తప్పు ఎవరిది? ఒప్పు ఎవరిది?" అన్నారు.

భగవాన్ మాట్లాడుతూ "మీరు, మీరిద్దరే శవవాహకులు అనుకుంటున్నారు. అందరూ శవవాహకులే! ఈ దేహమే శవం. దీనిని అందరూ 'నేను' అనుకుంటూ మోసుకుంటూ తిరుగుతారు. ఈ మైల చెరువులో మునిగితే పోదు. ఆత్మజలాభిషిక్తులు కావాలి!" అన్నారు భగవాన్ రమణ మహర్షి.

వారిద్దరూ ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

పోతునూరు అక్కయ్య మనుమడు నారాయణ తీర్థ గుంటూరు వెళ్ళి చదువుకుంటూ, ఆశ్రమంలో ఉంటున్నాడు. అతను ఒక రోజు ఆశ్రమంలో ఎంక్వైరీ ఆఫీసు వద్ద ఉండగా, కాపలా డ్యూటీలో ఉన్న పోలీసు వచ్చి, తన తుపాకిని బల్ల మీద ఉంచి, ఏదో మాట్లాడుతున్నాడు. పొరపాటున ఎవరిదో చెయ్యి తుపాకీ పేల్చే ట్రిగ్గరు మీద పడి తుపాకీ పేలింది. తుపాకి గుండు నారాయణ చట్టలోనికి దూసుకొని పోయి, శరీరంలో 100 ముక్కలుగా బ్రద్దలై శరీరంలోని అన్ని భాగాల్లోకి వెళ్ళి పోయాయి. అతడు బ్రతకడని అందరూ అనుకున్నారు. కానీ అతడు పరిపూర్ణ ఆరోగ్యంతో సుఖంగా ఉన్నాడు.



విశ్వాసంతో గురుదేవుని ఆశ్రయించుకుని మనసా ఆరాధించుకునే వారికి ఆపదలు, సమస్యలు ఎంత ఉపద్రవంగా వస్తాయో, అలాగే సమసిపోతాయి"అని పోతునూరు అక్కయ్యగారు తమ అనుభవాలను పై విధంగా వెల్లడించారు.

*భక్తుని భక్తి పున్నమచంద్రుని వలె పరిపూర్ణమైనపుడు, గురుదేవుని దయ అనే సముద్రము ఉప్పొంగి, ఉవ్వెత్తున ఎగసిన కెరటాల వలె వారి అనుగ్రహ లీలలు వాటంతట అవే జరిగిపోతాయి. గురుదేవులు మాత్రము సముద్రము వలె ప్రశాంత గంభీరులు. మానవుని భక్తి అహంకార రహితమైనపుడు భగవంతుని దయ పరిపూర్ణము.*

-గత సంచిక తరువాయి

విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# సూరదాస్



ఇంకా ఇలా ప్రభువును వేడుకొంటున్నాడు -

తుమ్ తుజి ఔర్ కౌన్‌పే జావూం।
కాకేద్వారే జాయె సిరనావూం పర్ హత్‌కా
బికావూం ॥
ఐసో కో దాతా హై సమరథ్ జాకె దియే
అఘావూం।
అంతకాల్ తమరో సుమిరన్ గతి, అంత్
కహూ నహి పావూం॥
రంక్ అయాచీ కియో సుదామా దియో
అభయ పద్ ఠావూం।
కామధేను చింతామని దీనో, కల్పవృక్షతర్ భావూం॥
భవ సముద్ర అతి దేఖి భయానక, మన్‌మే అధిక డరావూం।
కీజై కృపా సుమిరి అపనోపన్ సూర్‌దాస్ బలిజావూం ॥

"ప్రభూ నిన్ను విడిచి ఎక్కడికి వెళ్ళగలను? ఎవరి వద్ద శిరస్సు వంచగలను? సమర్థుడైన దాతవు నువ్వు ఉండగా పరుల పంచను ఎందుకుచేరాలి? నేను ఇతరులను ఆశ్రయించాల్సిన పని ఏమున్నది? అంత్యకాలంలో నీ స్మరణే చేస్తూ ఉండాలి. కాని ఆ అంత్యం ఎప్పుడో తెలియటం లేదు. కటిక పేద అయిన సుదాముడి యాచనను మన్నించి ఆయనకు అభయ పదం ఇవ్వలేదా? కామధేను చింతామణి ఇచ్చావు. కల్పవృక్ష ఛాయను ఇచ్చావు. భవ సముద్రం చూస్తే భయానకంగా వుంది. నాలో భయం అధికమవుతోంది. "ప్రభూ! నాపైన కృప చూపించు. నిన్ను శరణు వేడుతున్నాను" అని సూరదాస్ అంటున్నాడు.

"ఎన్నో జన్మలు రాసీ భూతమైతే వచ్చిన మానవ జన్మను మూర్ఖులై

నష్టం చేసుకుంటున్నారు. విషయ సుఖాలలో పడి వాటినే నిత్యం అని తలుస్తున్నారు. నామ భజన చేసి తరించండి. మానవ జన్మను వృధా చేసుకోకండి" అని హితవు చెపుతున్నాడు.

హరిని దర్శించటానికి తను పడే ఆవేదనను ఈ కీర్తనలో వివరిస్తున్నాడు.

అఖియా హరిదరశనకో ప్యాసీ ।
దేఖ్యో చాహత్ కమల్ నైన్‌కో, నిసి దిన రహత్ ఉదాసీ ॥
ఆయే ఉద్ధొ ఫిరి గయె ఆంగన్, డారి గయె గల్ ఫాసీ ।
కేసరి తిలక్ మోతియన్ మాలా బృందావన్ కే వాసీ ॥
నేహ లగాయ త్యాగి గయె తన్ సమ్ కారి గల్ ఫాసీ ॥
కాహు కె మన్‌కో కౌన్ జానత్, లోగన్‌కే మన హాసీ ॥
ప్రభు సూరదాస్ తుమ్హారే దరస బిన్ లైహో కరవట్ కాసీ ॥

"ప్రభూ! నీ దర్శనం కోసం నా కన్నులు ఎదురుచూస్తున్నాయి. నీ కమల నయనాలని చూద్దామనే ఆవేదనతో ఉన్నాను. కాని ప్రతిరోజూ నాకు నిరాశే ఎదురైంది. కేసరి తిలకం ధరించి మెడలో మోతీమాల ధరించే బృందావన వాసివి నాకు కనిపించినట్లే కనిపించి మాయమయ్యావు. ఎవరు ఏమనుకుంటే ఏమి? నవ్వుకుంటే ఏమి? ప్రభూ నీ దర్శనం కానిదే నా కంటికి నిద్రరాదు." అంటున్నాడు సూర్‌దాస్.

ఒకసారి కృష్ణుడు తన ఇంట్లో వెన్న తింటుండగా చూసింది యశోద. "తల్లి తనను చూసింది" అని తెలుసుకున్నాడు నవనీతచోరుడు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL